# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 4 | సంచిక: 107 | పేజీలు: 6 | వెల: రూ.3/- | సోమవారం 27 జులై 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608


### రక్షణ ఉత్పత్తులు, ఎగుమతుల్లో

# కొత్త శిఖరాలకు భారత్

## మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, జులై 26 (ప్రభాత ఉదయం)**

రక్షణ ఎగుమతుల్లో భారత్ కొత్త శిఖరాలను చేరుకుంటోందన్న ప్రధాని మోదీ- కార్గిల్ వార్‌లో దేశ సైనికులు వీరోచితంగా పోరాడారని కితాబు- మన్ కీ బాత్‌లో మోదీ ప్రసంగం భారత్ ఒక విశ్వసనీయమైన ప్రపంచ రక్షణ భాగస్వామిగా ఎదుగుతోందని నరేంద్ర మోదీ తెలిపారు. దేశం తన రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటూనే ఉందన్నారు. అలాగే నేడు యావత్ దేశం 'కార్గిల్ విజయ్ దివస్' జరుపుకుంటున్న సందర్భంగా కార్గిల్ యుద్ధంలో శత్రువులతో వీరోచితంగా పోరాడిన భారత సైనికులకు ఘన నివాళులు అర్పించారు. 1999లో పాకిస్థాన్‌తో జరిగిన సంఘర్షణలో కఠిన వాతావరణ పరిస్థితులు, శత్రువు నుంచి సవాళ్లు ఎదురైనప్పటికీ దేశ సైనికులు అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారని కొనియాడారు. కార్గిల్ విజయ్ దివస్ దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ సాయుధ దళాలు ప్రదర్శించిన అసాధారణ ధైర్యసాహసాలను కార్గిల్ విజయ్ దివస్ అందరికీ గుర్తుచేస్తుందని అన్నారు. ఆదివారం ప్రసారమైన 136వ 'మన్ కీ బాత్' ఎపిసోడ్‌లో మోదీ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

ఈ నెల (జులై) లో డీఆర్‌డీఓ పినాకా దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్‌ను విజయవంతంగా పరీక్షించిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ఈ విజయం వెనుక భారత శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల సమష్టి కృషి ఉందని అభిప్రాయపడ్డారు. కేవలం రెండు- మూడు రోజుల క్రితమే డీఆర్‌డీఓ కుశ క్షిపణిని కూడా సక్సెస్‌ఫుల్‌గా పరీక్షించిందని తెలిపారు. కొన్ని రోజుల క్రితం ఐఎన్ఎస్ మహేంద్రగిరిని భారత నౌకాదళంలోకి ప్రవేశపెట్టారని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆధునిక యుద్ధనౌకను దేశంలోనే రూపకల్పన చేసి నిర్మించారని పేర్కొన్నారు. ఈ యుద్ధనౌక తయారీలో 75 శాతానికి పైగా స్వదేశీ పరికరాలను ఉపయోగించారని, ఇది పెరుగుతున్న 'ఆత్మనిర్భర్ భారత్' బలానికి ప్రతీక అని అభివర్ణించారు.

**'యువ ఆవిష్కర్తలు దూసుకెళ్తున్నారు'**

"జులై 18న దేశ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1'ను శ్రీహరికోటలో విజయవంతంగా .మిగతా 2లో



# పరీక్షల సమర్థ నిర్వహణకు టాస్క్‌ఫోర్స్

### నందన్ నీలేకని నేతృత్వంలో ఏర్పాటు

### పారదర్శకత పెంపునకు, లీకేజీలకు అడ్డుకట్ట

### పార్లమెంట్ ముందుకు త్వరలో కఠిన చట్టాలు

**న్యూఢిల్లీ, జులై 26 (ప్రభాత ఉదయం)**

విద్యార్థుల భవిష్యత్తు, పేపర్ లీకేజీల వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ కీలక నిర్ణయం తీసుకున్నారు. పోటీ పరీక్షల్లో పారదర్శకత పెంపు, అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ కీలక నిర్ణయం ప్రకటించారు. నందన్ నిలేకని ఆధ్వర్యంలో హైపవర్డ్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పరీక్షల నిర్వహణలో సమూల మార్పులు తీసుకురావడంతో పాటు పేపర్ లీకేజీలను పూర్తిగా అరికట్టేలా సమగ్ర సంస్కరణలు చేపట్టనున్నట్లు ప్రధాని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు భారత ప్రభుత్వం అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన ఎవరూ తప్పించుకోలేరని, ఇప్పటికే తప్పు చేసిన వారు జైళ్లలో మగ్గుతున్నారని ఆయన హెచ్చరించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను మరింత పెంచేందుకు, తప్పులకు పాల్పడేవారిపై సత్వర విచారణ జరిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని తెలిపారు. ఈ నేపథ్యంలో క్రిమినల్ కేసుల విచారణ వేగవంతం చేయడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో .మిగతా 2లో

### ఇక ఏ ఎన్నికల్లోనూ

# పోటీ చేయను



ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉంటా.. నేటి రాజకీయాలు పూర్తిగా అవినీతిమయం

గెలవాలంటే డబ్బే కీలక పాత్ర.. నిజాయితీకి ఆస్కారం లేదు

కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య వ్యాఖ్యలు

2లో..

# కొమురవెల్లిలో కొత్త రైల్వే స్టేషన్ ప్రారంభం

### నెరవేరిన లక్షలాది మంది భక్తుల చిరకాల స్వప్నం.. కొమురవెల్లిలో నూతన రైల్వే స్టేషన్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రులు

### మల్లన్న దర్శనానికి భక్తుల ప్రయాణ ఇబ్బందులను తొలగించడమే లక్ష్యం



**సిద్దిపేట, జులై 26 (ప్రభాత ఉదయం)**

సిద్ధిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లిలో కొత్త రైల్వే స్టేషన్‌ను కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రారంభించారు. కొమురవెల్లి పుణ్యక్షేత్రంలో రైల్వే స్టేషన్ ప్రారంభం ఒక చరిత్రాత్మక ఘట్టమని కిషన్‌రెడ్డి కొనియాడారు. హైదరాబాద్ ఇతర ప్రాంతాల నుంచి మల్లన్న స్వామిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఈ స్టేషన్ ప్రయాణాన్ని సౌకర్యవంతంగా మారుస్తుందన్నారు. చిన్నప్పుడు ఆలయానికి వెళ్లడానికి ఇబ్బందులు పడ్డా : లక్షలాది మంది భక్తుల చిరకాల స్వప్నం కొమురవెల్లికి రైల్వే స్టేషన్ రావడమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ప్రసిద్ధ ..మిగతా 2లో

### శ్రీరాంసాగర్ జలాశయంలో... ఈతకు వెళ్లిన

# నలుగురు యువకులు మృతి



జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో విషాద ఘటన

ముప్కాల్ వద్ద బ్యాక్‌వాటర్‌లో ఈతకు వెళ్లి నలుగురు యువకులు మృతి

ఐదుగురిలో ఒకరు సురక్షితంగా ఒడ్డుకు చేరిక

స్థానికులు మృతదేహాలను వెలికితీశారు.

ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టిన పోలీసులు

2లో..



### ప్రైవేటు ఉద్యోగులను.... విచారించే అధికారం

# హెచ్ఆర్‌సీకి లేదు

### తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు

ప్రైవేట్ కంపెనీలపై హెచ్ఆర్‌సీకి విచారణ అధికారం లేదన్న హైకోర్టు

హెచ్ఆర్‌సీ పరిధి ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితమని వెల్లడి

వెల్స్ ఫార్గో కంపెనీ ఉద్యోగినుల వేధింపుల ఫిర్యాదుపై తీర్పు

పని ప్రదేశంలో వేధింపులపై 'పోష్' చట్టం కిందనే ముందుకెళ్లాలని సూచన

**న్యూఢిల్లీ, జులై 26 (ప్రభాత ఉదయం)**

ప్రైవేట్ కంపెనీలు, వాటి ఉద్యోగులపై వచ్చే ఫిర్యాదులను విచారించే అధికారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు (హెచ్ఆర్‌సీ) లేదని తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. హెచ్ఆర్‌సీ పరిధి కేవలం ప్రభుత్వ ఉద్యోగులు, వారి నిర్లక్ష్యానికి సంబంధించిన అంశాలకే పరిమితమని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. వెల్స్ ఫార్గో ఇంటర్నేషనల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తున్న ఇద్దరు ..మిగతా 2లో



### అఖిలేశ్‌కు అసదుద్దీన్ ఓవైసీ

# ఓపెన్ ఆఫర్

యూపీలో పొత్తుకు సిద్ధం

యూపీలో బీజేపీని ఓడించేందుకు ఎస్పీతో పొత్తుకు సిద్ధమన్న అసదుద్దీన్ ఓవైసీ

2లో..

# అమిత్ షాకు రాహుల్ ఘాటు లేఖ



జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై దాడిని ఖండించిన రాహుల్

శాంతియుత నిరసనపై పెల్లెట్ గన్లు వాడారని తీవ్ర ఆరోపణ

దాడికి అనుమతి ఎవరు ఇచ్చారో చెప్పాలని లేఖలో డిమాండ్ చేశారు

మహిళా విద్యార్థినులను లక్ష్యంగా చేసుకున్నారని విమర్శలు

2లో..

## రక్షణ ఉత్పత్తులు, ఎగుమతుల్లో

# కొత్త శిఖరాలకు భారత్

మొదటి పేజీ తరువాయి...

ప్రయోగించడంతో భారత్‌లోని ప్రతి పౌరుడు గర్వంతో ఉప్పొంగిపోయాడు. దేశ అంతరిక్ష రంగంలోని ఈ చరిత్రాత్మక ఘట్టానికి ప్రతి ఒక్కరూ సాక్షులుగా నిలిచారు. ప్రైవేట్ సంస్థ అభివృద్ధి చేసిన భారతదేశపు మొట్టమొదటి రాకెట్ ఇది. ఒకప్పుడు ఊహకు కూడా అందని దానిని మన యువ ఆవిష్కర్తలు నిజం చేసి చూపించారు. యువ ఆవిష్కర్తలు అద్భుతమైన నైపుణ్యం, ఫ్యాషన్‌ను కనబర్చారు" అని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

**కామన్వెల్త్ గేమ్స్‌లో భారత అథ్లెట్లు పతకాలు సాధించాలి : మోదీ**

ఈ ఏడాది జులై 4న ప్రారంభించిన దేశవ్యాప్త 'క్యాచ్ ది రెయిన్' ప్రచారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజల ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో వర్షపు నీటి సేకరణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం, సంప్రదాయ జలాశయాల



పునరుద్ధరణ, పెద్ద ఎత్తున మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. అలాగే గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో భారత అథ్లెట్స్ అద్భుతమైన ప్రదర్శన చేసి మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు పతకాలు గెలిచి దేశానికి గర్వకారణంగా నిలవాలని కోరారు.

**'పీవీ సింధు, టీమ్ఇండియా మహిళల క్రికెట్ జట్టుకు అభినందనలు'**

జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టైటిల్ గెలిచిన తొలి భారతీయురాలిగా నిలిచిన పీవీ సింధును మోదీ అభినందించారు. లండన్‌లోని లార్డ్స్‌లో చారిత్రక తొలి టెస్ట్ విజయాన్ని నమోదు చేసిన టీమ్ఇండియా మహిళల క్రికెట్ జట్టునూ ప్రశంసించారు. స్థానికంగా లభించే సహజ మట్టితో చేసిన విగ్రహాలను పూజించి గణేశ్ చతుర్థిని ఆనందంగా జరుపుకోవాలని దేశ పౌరులకు మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవమని, ఈ సందర్భంగా నేత కార్మికులకు ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది ఆగస్టు 15న ప్రతి ఇంటిలో జాతీయ జెండాను సగర్వంగా ఎగరవేయడం ద్వారా 'హర్ ఘర్ ' ప్రచారంలో పాల్గొనాలని కోరారు.

# కొమురవెల్లిలో కొత్త రైల్వే స్టేషన్ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి...

పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లన్న భక్తుల ప్రయాణ ఇబ్బందులను తొలగించేందుకు ఈ కొత్త రైల్వే స్టేషన్ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. చిన్నప్పుడు ఆలయానికి వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడ్డానని తెలిపారు. ఎన్నికల సమయాల్లోనే రాజకీయాలని అనంతరం దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే బీజేపీ లక్ష్యమని చెప్పారు. రాబోయే రోజుల్లో రైల్వేతో పాటు, రహదారుల నిర్మాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ దత్తాత్రేయ, ఎంపీలు రఘునందన్ రావు, చమల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైలు సౌకర్యంతో భక్తులకు ఊరట : ప్రస్తుతం మల్లన్న స్వామి భక్తులు బస్సులు ఇతర వాహనాల ద్వారానే కొమురవెల్లికి చేరుకుంటున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఇక్కడికి వస్తుంటారు. రాజీవ్ హైవే నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొమురవెల్లికి చేరుకోవడానికి తిరిగి



వెళ్లడానికి బస్సులో ప్రయాణించేవారు. తరచుగా ప్రధాన రహదారిపై గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. హైదరాబాద్ నుంచి సుమారు 110 కిలోమీటర్లు లేదా కరీంనగర్ నుంచి 90 కిలోమీటర్ల రోడ్డు ప్రయాణంలో ప్రయాణికులు తరచుగా రెండు లేదా మూడు వేర్వేరు వాహనాలను మారాల్సి వచ్చేది. ఇప్పుడు చెర్యాల, మద్దూరు, ధూల్మిట్ట మండలాల ప్రజలకు కూడా రైలు సౌకర్యం అందుబాటులోకి రానుంది.

ఈ ప్రాంతంలో ప్రతిరోజూ విద్యార్థులు చిన్న తరహా వ్యాపారులతో సహా సుమారు 100 నుంచి 200 మంది ప్రయాణిస్తుంటారు. హైదరాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులు లేదా ప్రైవేట్ వాహనాల్లో వచ్చే వారికి తలసరి సుమారు రూ.100 నుంచి రూ.200 వరకు ఖర్చవుతుండగా, కరీంనగర్ నుంచి వచ్చేవారు రూ.100 నుంచి రూ.150 వరకు ఖర్చు చేస్తున్నారు. రైలు ప్రయాణం వల్ల ఈ ఖర్చులు సగానికి తగ్గుతాయని చాలా మంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**ఈ రైళ్లకు ఎక్కడెక్కడ నిలుపుదల ఉందంటే :**

సికింద్రాబాద్ టూ సిద్దిపేట మధ్య నడిచే నాలుగు డెమో రైళ్లకు ఈ స్టేషన్‌లో హాల్ట్ సౌకర్యం కల్పించారు.

సిద్దిపేట టూ కొమురవెల్లికి, రైలు 77654 ప్రతిరోజూ (బుధవారాలు మినహా) మధ్యాహ్నం 2:38 గంటలకు, రైలు 77656 ప్రతిరోజు (గురువారాలు మినహా) ఉదయం 6:45 గంటలకు ఇక్కడికి చేరుకుంటాయి.

సికింద్రాబాద్ నుంచి సిద్దిపేటకు వెళ్లే రైళ్ల విషయాని కొస్తే డెమో రైలు 77653 ప్రతిరోజు (బుధవారాలు తప్ప) మధ్యాహ్నం 12:44 గంటలకు కొమురవెల్లికి చేరుకుంటుంది. అలాగే రైలు 77655 ప్రతిరోజు రాత్రి 8:04 గంటలకు చేరుకుంటుంది.

# ఇక ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయను

**న్యూఢిల్లీ, జులై 26 (ప్రభాత ఉదయం)**

కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య సంచలన ప్రకటన చేశారు.ఇకపై తాను ఏ ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించారు. నేటి రాజకీయాల్లో వస్తున్న మార్పులు, వయసురీత్యా వస్తున్న అనారోగ్య సమస్యల కారణంగానే తాను ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. 2028లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఎలాంటి పరిస్థితుల్లోనూ పోటీ చేయబోనని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. వరుణా నియోజకవర్గ ప్రజలు తనపై ఒత్తిడి తెస్తున్నప్పటికీ, ఇకపై ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నికలంటే నియోజకవర్గ ప్రజలే స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చి గెలిపించేవారని, కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నేటి రాజకీయాలు పూర్తిగా అవినీతిమయమయ్యాయని, ఎన్నికల్లో గెలవాలంటే డబ్బు కీలక పాత్ర పోషించే దుస్థితి వచ్చిందని విమర్శించారు. నిజాయితీ రాజకీయాలకు ప్రస్తుత వ్యవస్థలో ఆసరా లేకుండా పోయిందని ఆయన అభిప్రాయపడ్డారు. తనకు ప్రస్తుతం 79 ఏళ్లు అని, ప్రస్తుత ప్రభుత్వ పదవీకాలం



ముగిసేనాటికి తన వయసు 81-82 సంవత్సరాలకు చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. వయసురీత్యా ఆరోగ్యం మునుపటిలా బలంగా లేకపోవడంతో, గతంలో ఉన్న ఉత్సాహంతో ఇకపై కష్టపడి పనిచేయడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. 1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించినట్లు సిద్ధరామయ్య గుర్తుచేసుకున్నారు. 2028 నాటికి తన రాజకీయ జీవితంలోకి వచ్చి సరిగ్గా ఐదు దశాబ్దాలు (50 ఏళ్లు) పూర్తవుతాయని తెలిపారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో ఓటములు, విజయాలను చూశానని, అయితే తాను నమ్మిన సిద్ధాంతాలకు, మనస్సాక్షికి వ్యతిరేకంగా ఎప్పుడూ ప్రవర్తించలేదని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనప్పటికీ, రాజకీయాల్లో ఎప్పుడూ క్రియాశీలకంగానే ఉంటానని, ప్రజల కష్టసుఖాలకు నిత్యం గొంతుకగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. గత ఐదు దశాబ్దాలుగా రాష్ట్ర ప్రజలు తనను ఆదరించి నడిపించారని, ఆ రుణం తీర్చుకోలేనిదంటూ తన భవిష్యత్ జీవితాన్ని కూడా పూర్తిగా ప్రజా సేవకే అంకితం చేస్తానని సిద్ధరామయ్య ప్రకటించారు.

## శ్రీరాంసాగర్ జలాశయంలో... ఈతకు వెళ్లిన

# నలుగురు యువకులు మృతి

**నిజామాబాద్ జులై 26 (ప్రభాత ఉదయం)**

నిజామాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్ పీ) బ్యాక్‌వాటర్‌లో ఈతకు వెళ్లిన నలుగురు యువకులు నీట మునిగి మృతి చెందారు. వీరితో పాటు వెళ్లిన మరో యువకుడు సురక్షితంగా ఒడ్డుకు చేరుకోవడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే, ముప్కాల్ సమీపంలోని శ్రీరాంసాగర్



ప్రాజెక్టు వెనుక జలాల్లోకి ఐదుగురు యువకులు ఆదివారం సాయంత్రం ఈతకు వెళ్లారు. నీటి లోతును అంచనా వేయలేకపోవడంతో నలుగురు గల్లంతయ్యారు. వారిలో ఒకరు ప్రాణాలతో బయటపడి ఒడ్డుకు చేరుకున్నారు. అతని సమాచారంతో స్థానికులు వెంటనే స్పందించి గాలింపు చేపట్టారు. కొద్దిసేపటికే నలుగురి మృతదేహాలను స్థానికులు వెలికితీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. మృతుల్లో ముగ్గురు నిజామాబాద్ పట్టణానికి చెందిన వారిగా ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అమిత్ షాకు రాహుల్ గాంధీ

# ఘాటు లేఖ

**న్యూఢిల్లీ, జులై 26 (ప్రభాత ఉదయం)**

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత వారం విద్యార్థులపై జరిగిన పోలీసు దాడి ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. విద్యార్థులపై జరిగిన ఈ "క్రూరమైన దాడి"కి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఆయన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ఆదివారం ఒక లేఖ రాశారు. ఈ దాడిలో ప్రాణాంతకమైన పెల్లెట్ గన్లను ప్రయోగించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే, జూలై 20న జంతర్ మంతర్ వద్ద "న్యాయమైన, జవాబుదారీతనంతో కూడిన విద్యా వ్యవస్థ" కోసం విద్యార్థులు శాంతియుతంగా నిరసన చేపట్టారని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. అయితే, భద్రతా బలగాలు వారిపై విచక్షణారహితంగా



బలప్రయోగం చేశాయని ఆరోపించారు. భాష్పవాయువుతో పాటు, ప్రమాదకరమైన పెల్లెట్ గన్లను కూడా వాడారని, ఈ దాడిలో వందలాది మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ముఖ్యంగా, మహిళా విద్యార్థినులను లక్ష్యంగా చేసుకుని, వారి సున్నితమైన భాగాలపై దాడి చేశారని తీవ్రంగా ఆరోపించారు. ఈ ఘటనలో 19 ఏళ్ల విద్యార్థి సాహిల్ లోచాబ్ కంటికి పెల్లెట్ తగలడంతో, అతను శాశ్వతంగా కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉందని రాహుల్ తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఉద్దేశించి ఆయన రెండు సూటి ప్రశ్నలు సంధించారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాహుల్ డిమాండ్ చేశారు.



# పరీక్షల సమర్థ నిర్వహణకు టాస్క్‌ఫోర్స్

మొదటి పేజీ తరువాయి...

ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మరింత కఠినమైన చట్టాన్ని పార్లమెంటు ముందుకు తీసుకురానున్నట్లు మోదీ ప్రకటించారు.

**నందన్ నీలేకని నేతృత్వంలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు**

కేవలం శిక్షలే కాకుండా, రాబోయే తరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షల విధానంలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని మోదీ అభిప్రాయపడ్డారు. మన పరీక్షల విధానం మరింత పారదర్శకంగా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధన కోసమే ప్రపంచ ప్రసిద్ధ సాంకేతిక నిపుణుడు నందన్ నీలేకని నేతృత్వంలో ఒక హైపవర్డ్ టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని వెల్లడించారు. ఈ టాస్క్ ఫోర్స్ అందించే నివేదిక ఆధారంగా పరీక్షల వ్యవస్థ ప్రక్షాళనకు తగిన చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

**నందన్ నిలేకని ఎవరంటే ?**

నందన్ నీలేకని భారత్‌లో అత్యంత ప్రసిద్ధులైన ప్రముఖ సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్త.. ప్రపంచ ప్రఖ్యాత ఐటీ దిగ్గజ సంస్థ అయిన 'ఇన్ఫోసిస్' సహ వ్యవస్థాపకులలో ఆయన ఒకరు. అంతేకాకుండా ఆ సంస్థకు సీఈఓగా, ఛైర్మన్‌గా కూడా సేవలందించారు.. భారతదేశంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఆధార్ ప్రాజెక్టుకు తొలి ఛైర్మన్‌గా వ్యవహరించారు. కేంద్ర కేబినెట్ మంత్రి హోదాలో ఆయన దేశ ప్రజలందరికీ బయోమెట్రిక్ గుర్తింపు సంఖ్య (ఆధార్) అందించడంలో కీలక పాత్ర పోషించారు. సాంకేతిక, ఆర్థిక రంగాలకు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 2006లో ఆయనను దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్ తో సత్కరించింది. అలాగే టైమ్ మ్యాగజైన్ ప్రపంచంలోని అత్యంత ప్రభావశీల వ్యక్తులలో ఒకరిగా ఆయన్ను పేర్కొంది. దేశంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిలోనూ, విద్యారంగంలో సాంకేతికతను జోడించే కార్యక్రమాలలోనూ ఆయన క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

## ప్రైవేటు ఉద్యోగులను.... విచారించే అధికారం

# హెచ్ఆర్‌సీకి లేదు

మొదటి పేజీ తరువాయి...

మహిళా ఉద్యోగులు, తమకు పనిప్రదేశంలో వేధింపులు ఎదురయ్యాయని ఆరోపిస్తూ హెచ్ఆర్‌సీని చేపట్టింది. ఉద్యోగ వివాదాలు, పనితీరు మదింపు వంటివి యజమాని, ఉద్యోగుల మధ్య ఉండే అంతర్గత వ్యవహారాలని ధర్మాసనం పేర్కొంది. ఇటువంటి సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ప్రత్యేక చట్టపరమైన వేదికలు ఉన్నాయని తెలిపింది. ఆరోపణల తీవ్రతను బట్టి హెచ్ఆర్‌సీ తన అధికార పరిధిని విస్తరించుకోలేదని అభిప్రాయపడింది. ముఖ్యంగా పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల వంటి ఫిర్యాదులకు 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్ చట్టం) ' సరైన మార్గమని ధర్మాసనం సూచించింది. బాధితులు ఆ చట్టం కింద ఏర్పాటైన అంతర్గత కమిటీలను ఆశ్రయించాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, హెచ్ఆర్‌సీ ముందు పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను కొట్టివేస్తూ, కంపెనీ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. అయితే, బాధితులు ఇతర చట్టాల ద్వారా న్యాయం పొందేందుకు స్వేచ్ఛ ఉందని తీర్పులో పేర్కొంది.

# యూపీలో పొత్తుకు సిద్ధం..

**న్యూఢిల్లీ, జులై 26 (ప్రభాత ఉదయం)**

దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో మరోసారి రాజకీయ సమీకరణాలు వేడెక్కుతున్నాయి. 2027లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్‌కు పొత్తు కోసం బహిరంగ ఆహ్వానం పంపారు. బీజేపీని మరోసారి అధికారంలోకి రాకుండా నిలువరించేందుకు కలిసి పనిచేయడానికి ఇదే సరైన సమయమని ఆయన స్పష్టం చేశారు.

మొరాదాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఓవైసీ మాట్లాడుతూ.. "ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడాన్ని మజ్లిస్ కోరుకోవడం లేదు. అందుకే నేను చేతులు కలపడానికి, పొత్తు పెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. మాట్లాడటానికి ఇదే సరైన సమయం. ఎన్నికలు ముగిశాక తర్వాత ఏడవద్దు" అంటూ అఖిలేశ్ యాదవ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తమ పార్టీ పోటీ చేయడం వల్ల ఎస్పీకి నష్టం జరుగుతుందనే వాదనను ప్రస్తావిస్తూ, ఆ నష్టం జరగకుండా ఉండేందుకే తాను పొత్తుకు సిద్ధంగా ఉన్నానని వివరించారు.

అయితే, ఈ పొత్తులో తమకు సమాన గౌరవం, హక్కులు కావాలని ఓవైసీ స్పష్టమైన సంకేతాలిచ్చారు. "మా పోరాటం ఏ మతానికి వ్యతిరేకం కాదు. మా గౌరవం, న్యాయం కోసమే ఈ పోరాటం. అఖిలేశ్ యాదవ్ కుర్చీలో కూర్చుంటే, నేను కూడా ఆయన ముందు సమానంగా కూర్చుని హక్కులు, న్యాయం గురించి చర్చిస్తాను" అని ఆయన పేర్కొన్నారు.

ఓవైసీ పొత్తు ప్రతిపాదనపై బీజేపీ వెంటనే స్పందించింది. ఇది బుజ్జగింపు రాజకీయాల కలయిక అని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు. "అఖిలేశ్, ఓవైసీ ఇద్దరూ బుజ్జగింపు రాజకీయాల్లో ఒకరితో ఒకరు పోటీ పడతారు. ఇప్పుడు 'పెద్ద భాయిజాన్ ఎవరు' అనే పోటీని పక్కనపెట్టి 'భాయిజాన్ కలయిక' కోసం చూస్తున్నారు. అందుకే ఓవైసీ, అఖిలేశ్‌కు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్నారు" అని ఆయన ఎద్దేవా చేశారు.

కాగా, యూపీలో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షంగా సమాజ్‌వాదీ పార్టీ ఉంది. 2027 ఎన్నికలను పార్లమెంట్ ఎన్నికలకు సెమీ ఫైనల్‌గా భావిస్తున్న తరుణంలో ఓవైసీ ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ ఆఫర్‌పై అఖిలేశ్ యాదవ్ నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు.



# గోల్కొండ బోనాల జాతరలో తొట్టెల ఊరేగింపు

### పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

**రాజేంద్రనగర్,జులై26(ప్రభాత ఉదయం)**

తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహిస్తున్న బోనాల జాతరలో భాగంగా గోల్కొండలో జరిగిన తొట్టెల ఊరేగింపు ఆదివారం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా సాగింది.గోల్కొండ బంజారా దర్వాజా సమీపంలోని హనుమాన్ మందిర్ ప్రాంగణంలో కళా సిండికేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.మాజీ కౌన్సిలర్ మక్తాల కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో తొట్టెల ఊరేగింపు,సాంప్రదాయ పూజలు,డప్పు వాయిద్యాలు,పోతరాజుల విన్యాసాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.పెద్ద సంఖ్యలో మహిళలు బోనాలు సమర్పించగా,యువత ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ...బోనాల పండుగ తెలంగాణ ఆధ్యాత్మికతకు,సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని అన్నారు.ఇలాంటి పండుగలు ప్రజల్లో ఐక్యత,సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాఘవ్,రాహుల్,ఎల్.ఎన్.ఆర్,వరుణ్‌తేజ్‌తో పాటు నిర్వాహకులు,స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.



# "బతికినన్నాళ్లు నా పాట ఉంటుంది"..

### రచయిత మన్నె మహాత్మారావు ముదిరాజ్

### తెలంగాణ బోనాల జాతర-2026జానపద సాంస్కృతిక గానతోరణం పుస్తకావిష్కరణ..

**రాజేంద్రనగర్,జులై26(ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ పోచమ్మ ఆలయ ప్రాంగణంలో ప్రముఖ కవి,రచయిత,నంది అవార్డు గ్రహీత మన్నె మహాత్మారావు ముదిరాజ్ రచించిన "తెలంగాణ బోనాల జాతర-2026జానపద సాంస్కృతిక గానతోరణం"పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రచయిత మన్నె మహాత్మారావు ముదిరాజ్ మాట్లాడుతూ..."బతికినన్నాళ్లు నా పాట ఉంటుంది.నేను జీవించి ఉన్నంతకాలం ప్రజల కోసం,తెలంగాణ సంస్కృతి కోసం పాటలు రాస్తూనే ఉంటాను"అని అన్నారు.ఇప్పటివరకు 15పుస్తకాలు రచించానని,త్వరలో మరిన్ని గ్రంథాలను పాఠకుల ముందుకు తీసుకొస్తానని తెలిపారు.తెలంగాణ జానపద సంప్రదాయాలు,భక్తి సాహిత్యాన్ని భావితరాలకు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.గౌతమ్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ బి.బాలరాజ్ ముదిరాజ్ గురుస్వామి ఈ పుస్తకాన్ని ప్రచురించారు.ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ వైద్యులు,సాధన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్మోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ...మన్నె మహాత్మారావు రచనలు తెలంగాణ జానపద సాహిత్యానికి విలువైన సంపదగా నిలుస్తాయని కొనియాడారు.సీనియర్ మహిళా నాయకురాలు యాదమ్మ మాట్లాడుతూ...మన్నె మహాత్మారావు సమాజానికి ఆదర్శప్రాయుడని,ఆయన రచించే పాటలు,భజనలు భక్తి భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు.ఆయన అడుగుజాడల్లో నడవడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ అమరేందర్,సీపీఐ నాయకులు పుస్తకాల నర్సింగ్‌రావు,నరసింహారెడ్డి,విద్యార్థి సంఘం నాయకుడు రామకృష్ణ,జహీరాబాద్ ఎమ్మార్వో కృష్ణ,ఉత్తంకుమార్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు సతీష్,కిస్మత్‌పూర్ గ్రామానికి చెందిన ఎస్.స్వామి,ప్రముఖ కవి,రచయిత,కళాకారుడు దుబ్బాకుల కృష్ణస్వామి,బుద్వేల్ భూషణం,మన్నె మహాత్మారావు శిష్యబృందం,మహిళలు,సాహితీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నల్ల పోచమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

### మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ తూమ్ శ్రావణ్ కుమార్

**కూకట్ పల్లి, జూలై 26 (ప్రభాత ఉదయం)**



కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజలందరికీ నల్ల పోచమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలని మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ తూమ్ శ్రావణ్ కుమార్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ దీన్ దయాల్ నగర్ లోని శ్రీ పోచమ్మ తల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ వారి ఆహ్వానం మేరకు ఆదివారం మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకులు తుకారాం, సుధాకర్ రెడ్డి, అరుణ్, జైరాజ్, కృష్ణ , అశోక్ బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ నాయకులనుద్దేశించి మాట్లాడుతున్న జె రుద్ర కుమార్

# కార్మికుల హక్కులను కాల రాసే నిర్ణయాలను తీసుకోవద్దు సీ ఐ టీ యూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జె రుద్ర కుమార్

**బుద్వేల్, జూలై 26 (ప్రభాత ఉదయం)**

దేశ నిర్మాణంలో పాలుపంచుకుంటున్న కార్మిక వర్గాన్ని ఇబ్బం దులు పెట్టే విదంగా, వారికి అందాల్సిన సంక్షేమ పథకాలను అందకుండా చూడాలనుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పోరాడటానికి సీఐటీయు నాయకులు, కార్యకర్తలు ఎల్లవేళలా సిద్ధంగా ఉం డాలని సీఐటీయు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జె రుద్రకుమార్ పిలుపునిచ్చారు. కాటేదాన్ లోని సీఐటీయు కార్యాలయంలో ఆదివారం రంగారెడ్డి జిల్లా లోని వివిధ మండలాలకు చెందిన అన్ని రంగాల ముఖ్య క్యాడర్లకు, సీఐటీయు అధ్యక్ష, కార్యదర్శులకు, ముఖ్య నాయకులకు దేశంలో జరుగుతున్న మార్పులను గురించి వివరించారు. భారత దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచి పోరాడి సాదించుకున్న అనేక చట్టాలు యూనియన్ పెట్టుకునే హక్కు, కనీస వేతన చట్టం, మెటర్నటీ చట్టం, కాంట్రాక్ట్ లేబర్ యాక్ట్, పీఎఫ్, ఈఎస్ఐ చట్టం, భవన నిర్మాణ కార్మికుల చట్టం లాంటి వాటిని నేడు అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లుగా కుదించి కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు ను వీబీజీ రామ్ జీ అని పేరు పెట్టి పరోక్షంగా మతాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే విత్తన నవరణ చట్టాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధం అవుతుందన్నారు. విద్యుత్ సవరణ చట్టం 2025 ను తీసుకువచ్చి అన్ని రకాల కార్మికులను ఆర్థికంగా బలహీన పరుస్తుందన్నారు. ఈ విదంగా అన్ని చోట్ల  కార్మికుల పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్ష సాదింపు చర్యలు చేపడుతున్నారన్నారు. అందుకే 1942 లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జరుగబోయే జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు బచ్చల కూర స్వామి, కె కవిత, బిక్షపతి, దుర్గాప్రసాద్, యాదయ్య, చెన్నయ్య, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు విజయవంతం

### 400 మంది క్రీడాకారుల ప్రతిభ.. రాష్ట్ర స్థాయికి విజేతల ఎంపిక

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 26(ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా ముగిసాయి.ఈ పోటీలలో సబ్ జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలురు, బాలికలకు కొరిగి, పూమ్సే ఈవెంట్లను నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా డివైఎస్ఓ  రామలింగేశ్వర గౌడ్, గద్వాల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యమ్. కృష్ణయ్య, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ అయ్యప్ప రెడ్డి, స్టేడియం ఇన్చార్జి బషీర్, మరియు వెంకటేష్ హాజరై పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..."తైక్వాండో వంటి యుద్ధకళలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, వినయం మరియు విధేయత వంటి సద్గుణాలను పెంపొందిస్తాయి అని అన్నారు ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి అని సూచించారు.జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి మాస్టర్ కే. శ్రీహరి మాట్లాడుతూ, జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానాలు (బంగారు పతకాలు) సాధించిన క్రీడాకారులు రాబోయే ఆగస్టు 8, 9, 10 తేదీల్లో కరీంనగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జోగులాంబ గద్వాల్ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు శ్రీనివాస్ శెట్టి, రంగస్వామి, మారుతి, శ్రీను, రామేశ్వరి, మల్లికార్జున్ గౌడ్, లింగేష్, విష్ణు, సుధీర్‌లతో పాటు సీనియర్ విద్యార్థులు, క్రీడాకారులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్  అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న డాక్టర్ మాగంటి శేషు మాధవ్

# కరీంనగర్‌కు చెందిన డాక్టర్ మాగంటి శేషుమాధవ్‌కు డాక్టర్ ఎం.వి రెడ్డి జాతీయ పురస్కారం -  2026

**బుద్వేల్, జూలై 26 (ప్రభాత ఉదయం)**

ఆంధ్రప్రదేశ్ లోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన 58వ వార్షిక స్నాతకోత్సవంలో డాక్టర్ మాగంటి శేషుమాధవ్ డాక్టర్ ఎం. వి రెడ్డి జాతీయ పురస్కారం 2026 ను అందుకున్నారు. రాజమండ్రి లోగల జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ కు డైరెక్టర్ గా పనిచేస్తున్న డాక్టర్ మాగంటి శేషు మాధవ్ కరీం నగర్ జిల్లాకు చెందిన శాస్త్రవేత్త. ఈ పురస్కారాన్ని ఆయన ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యూ ఢిల్లీ లో గల ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐఏఆర్ఐ)  డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస రావు, ఆచార్య ఎనో రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ పాలడుగు సత్యనారాయణ లు ఉన్నారు. డాక్టర్ మాధవ్ వరి జన్యు శాస్త్రం, అణు ప్రజననం, ఫంక్షనల్ జీనోమిక్స్, బయోటెక్నాలజీ రంగాలలో విశిష్ట పరిశోధనలు నిర్వహించి అధిక దిగుబడి, వ్యాధులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే వరి రకాలను అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించారు.

# రోడ్డుపై పడిపోయిన ఓఎంఆర్ షీట్లు డిస్మెటలింగ్‌కు తీసుకువెళ్తున్నవే

### అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ సీతయ్య

**బుద్వేల్, జూలై 26 (ప్రభాత ఉదయం)**

రోడ్డుపై ఓఎంఆర్ షీట్లు పడిన సంఘటన  తో పోలీస్ శాఖ లో కలకలం రేగింది. డీసీపీ స్థాయి అధికారులతో పాటు డీఎస్పీ స్థాయి అధికారులు, టాస్క్ ఫోర్స్ పోలీసులు, అత్తాపూర్ ఇన్స్ పెక్టర్, ఇంటలిజెన్స్ పోలీసులు రోడ్డుపై ఓఎంఆర్ షీట్లు పడిపోయాయని ఎలా తెలిసిందని ఆరా తీశారు. రోడ్డుపై పడిన ఓఎంఆర్ షీట్లను టీఎస్పీఎస్సీకి పంపించి అవి పాతవని, వాటిని డిస్మెటలింగ్ చేయడానికి కాంట్రాక్టర్ జబ్బార్ కు అప్పగించగా, ఆయన డీసీఎం లో వాటిని ఆరాంఘర్ వైపు తీసుకువెళుతున్న సమయంలో క్రింద పడిపోయాయని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. మెహిదీపట్నం నుంచి ఆరాంఘర్ చౌరస్తా కు వెళ్లే దారిలో పీవీ నర్సింహ్మారావు ఎక్స్ ప్రెస్ వే మార్గంలో పిల్లర్ నెంబర్ 227 నుంచి 240 వరకు రోడ్డుపై తెలం గాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కు చెందిన ఓఎంఆర్ షీట్లు శనివారం రాత్రి పదుల సంఖ్యలో పడి పోయాయి. వాటిని చూసిన బాటసారులు మీడియా కు సమాచారం అందించారు. డిస్మెటలింగ్ కు తీసుకువెళ్లేవైన ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా ఒక వైపు నీట్ ప్రశ్నాపత్రాల లీక్ వ్యవహారం దేశ వ్యాప్తంగా ఒక కుదుపు కుదుపుతుంది. ఈ నేఫథ్యంలో టీఎస్పీఎస్సీ లాంటి ఓ ప్రముఖ సంస్థ కు చెందిన ఓఎంఆర్ షీట్లు డిస్మెటలింగ్ కు తీసుకువెళుతున్న కాంట్రాక్టర్ వాటిని జాగ్రత్తగా తీసుకువెళ్లాల్సిన అవసరం ఉంది. అలా కాకుండ రోడ్డు పొడవునా వాటిని పారవేసుకుంటు వెళ్లడం ఆ కాంట్రాక్టర్ లో ఉన్న నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది.

**పడిపోయిన ఓఎంఆర్ షీట్లు డిస్మెటలింగ్ కు తీసుకువెళ్తున్నవే: అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య :**

శనివారం రాత్రి రోడ్డు పైన పడిపోయిన ఓఎంఆర్ షీట్లు టీఎస్పీఎస్సీ కి చెందినవని, అవన్ని పాతవని అత్తాపూర్  ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య తెలిపారు. వాటిని డిస్మెటలింగ్ కు జబ్బార్ అనే కాంట్రాక్టర్ కు అప్పచెప్పగా ఆయన డీసీఎం వ్యాన్ లో వాటిని ఆరాంఘర్ కు తరలించాడన్నారు. అలా తీసుకువెళుతుం డగా రోడ్డుపై పడిపోయాయని తమ ధర్యాప్తులో తేలిందన్నారు.



రాజేంద్రనగర్ లో జరిగిన ఏకలవ్య జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఏకలవ్య ఎరుకల సంఘం ప్రతినిధులు

# రాజేంద్రనగర్‌లో ఏకలవ్య జయంతి వేడుకలు

**బుద్వేల్, జూలై 26 (ప్రభాత ఉదయం)**

ఏకలవ్య గురుభక్తి, అంకిత భావం, దీక్ష, పట్టుదల నేటి యువత కు ఆదర్శప్రాయమని రాజేంద్రనగర్ మండల ఏకలవ్య ఎరుకల సంఘం ముఖ్య సలహాదారులు డాక్టర్ సుల్తాన్ అమరేందర్, అధ్యక్షులు కోనేరు బాలనర్సింహ్మలు అన్నారు. రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ ఆవరణలో ఆదివారం ఏకలవ్య ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతి వేడుకలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏకలవ్య జీవితంలోని గొప్ప విలువలను భావితరాలు ఆదర్శంగా తీసుకుని విధ్యా, క్రమ శిక్షణ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు బదనాపురం వెంకటరామయ్య, ప్రధాన కార్యదర్శి బోనుగుల నాగరాజు, కార్యదర్శి బానేటి మల్లికార్జున, కోశాధికారి కండ్లీ క్రిష్ణ, కార్యవర్గ సభ్యులు దసీరు భిక్షపతి, దేవరాయ శశి, కె భాస్కర్, బి మహేశ్వరమ్మ, ఈ భీమేష్, ఈ అంజయ్య, డి చంద్రయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బుద్వేల్ శ్రీ పోచమ్మ దేవాలయంలో అన్నదానం

బుద్వేల్ శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో పూజలు చేస్తున్న దేవాలయ కమిటీ అధ్యక్షులు కుక్కునూరి రజనీ కాంత్ గౌడ్, బండారి బాలకృష్ణ, గోపాల్ ముదిరాజ్ తదితరులు





అన్న దాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

**బుద్వేల్, జూలై 26 (ప్రభాత ఉదయం)**

బుద్వేల్ గ్రామ దేవత శ్రీ పోచమ్మ దేవాలయం కమిటీకి మూడు సంవత్సరాల క్రితం అధ్యక్షునిగా నియమితులైన కుక్కునూరు రజనీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం న్యూ గ్రీన్ సిటీ లోని పోచమ్మ దేవాలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో బుద్వేల్ పరిసర కాలనీల నుంచి భక్తులు పెద్ద సం ఖ్యలో హాజరైనారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అందరు కలసి అన్నదానం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లోహిత్ రెడ్డి, పెండ్యాల శ్రీధర్, బద్దం దాస్ గౌడ్, బండారు బాలక్రిష్ణ, అరవింద్, ఆనంద్ గౌడ్, గోపాల్ ముదిరాజ్, శేఖర్ రెడ్డి, వెంకటరమణ తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జూరాల వైపు పరుగులు తీస్తున్న కృష్ణవేణి


## జూరాల ప్రాజెక్టుకు చేరుకోనున్న కృష్ణా వరద నీరు -- ఆయకట్టు రైతాంగానికి ఊరట

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 26(ప్రభాత ఉదయం)**

మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కర్ణాటకలోని ఆల్మట్టి డ్యాంకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఆల్మట్టి డ్యాం పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో ఆల్మట్టి నుంచి దిగువకు నీటిని విడుదల చేశారు. ఆల్మట్టి డ్యాం నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని దృష్టిలో పెట్టుకుని నారాయణపూర్ డ్యాం నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో కృష్ణా వరద ప్రవాహం మొదలైంది. ఈ వరద ప్రవాహం ఆదివారం సాయంత్రానికి తెలంగాణలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు చేరుకోనున్నట్లు జూరాల ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు లేక,సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న తెలంగాణ రైతాంగానికి వరద నీటి రాకతో కొంత ఊరటనిచ్చే అవకాశం ఉంది.

**తెరుచుకున్న నారాయణపూర్ ప్రాజెక్టు గేట్లు**

మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు కర్ణాటకలోని కృష్ణా ప్రాజెక్టులైన ఆలమట్టికి 84,888 క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆల్మట్టి నుంచి దిగువకు 67,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.



నారాయణపూర్ డ్యాంకు వరద ప్రవాహం వస్తున్న క్రమంలో నారాయణపూర్ ప్రాజెక్టు 8 గేట్లు తెరిచి దిగువనున్న జూరాల వైపు 24,560 క్యూసెక్కులు వరద నీటిని నదిలోకి వదులుతున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 33.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 31.96 టీఎంసీల నిల్వ ఉంది. నారాయణ పూర్ డ్యాం నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు ఆదివారం వరద నీరు వచ్చే చేరే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. ఈ వరద ప్రవాహం ఇలాగే కొనసాగితే జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకునే అవకాశం ఉంది. జూరాల పూర్తి స్థాయి నీటిమట్టం 318.516 మీట ర్లు కాగా ప్రస్తుతం 315.91 మీటర్లుగా ఉన్నది. పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలగానూ ప్రస్తుత నీటి నిల్వ 5.042 ఉన్నది. జూరాలలో పూర్తి స్థాయిలో నీటిమట్టం లేకపోవడంతో జూరాల ఆయకట్టు మీద ఆదారపడిన నెట్టెంపాడు, కోయిల్ సాగర్, కుడి, ఎడమ, సమాంతర కాలువలకు సాగు నీటి విడుదలలో జాప్యం ఉండవచ్చని, ఇక ముందు కూడా వర్షాలు కురిసే అవకాశం సన్నగిల్లడంతో సాగుకు నీటి విడుదల చేయకపోవచ్చని సమాచారం.

**నేడు జూరాలను తాకనున్న నీలవేణి**

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు శనివారం సాయంత్రానికి ఆల్మట్టి డ్యామ్‌కు 84,888 క్యూసెక్కుల నీరు రాగా గేట్లు ఎత్తి 67,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శనివారం సాయంత్రానికి నారాయణపూర్ డ్యామ్‌కు 43888 క్యూసెక్కుల ఇన్ ఫ్లోనమోదు కాగ నారాయణపూర్ డ్యాం 8 గేట్లు ఎత్తి 24,560 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. కర్ణాటక జలాశయాల నుంచి విడుదల చేసిన వరద నీరు ఆదివారం నారాయణపేట్ జిల్లా తంగిడి వద్ద కృష్ణానదిలో వరద నీరు కలువనున్నది. నారాయణపూర్ డ్యాం నుంచి ఔట్ ఫ్లో మరింతగా పెరిగే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ వర్గాలు చెబుతున్నాయి.



# కొమురవెల్లి రైల్వేస్టేషన్ ప్రారంభమైంది..

## మల్లన్న భక్తులు రెడీ అయిపోండి!

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూలై 26(ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్రంలో కొమురవెల్లి మల్లన్న భక్తులకు శుభవార్త. కొమురవెల్లి మల్లన్న భక్తులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది.సిద్దిపేట జిల్లా కొమురవెల్లి లోని నూతన రైల్వేస్టేషన్ ను కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు నేడు ప్రారంభించారు. కొమురవెల్లి మల్లన్న భక్తుల సౌకర్యార్థం 5.63 కోట్ల రూపాయల వ్యయంతో దీనిని నిర్మించారు.

**కొమురవెల్లి రైల్వే స్టేషన్ ను ప్రారంభించిన కేంద్ర మంత్రులు**

కొమురవెల్లి ఆలయానికి మూడు కిలోమీటర్ల దూరంలో నిర్మించిన ఈ రైల్వే స్టేషన్ ను నేడు కేంద్రమంత్రులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ దత్తాత్రేయ, ఎంపీలు లక్ష్మణ్, రఘునందన్ రావు, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంపైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఈ రైల్వేస్టేషన్ ప్రారంభం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు.బి

**భక్తుల ఇబ్బందులకు చెక్**

హైదరాబాద్ నుండి మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుందని వెల్లడించారు. ప్రస్తుతం కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి వస్తున్న భక్తులు బస్సులు, వాహనాలలో వస్తూ ఇబ్బంది పడుతున్నారని, రైల్వే స్టేషన్ ప్రారంభంతో ఆ ఇబ్బందులు తొలగిపోయినట్టే అని తెలిపారు. హైదరాబాద్ నుంచి 110 కిలోమీటర్లు, కరీంనగర్ నుంచి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి రావడానికి ప్రజలు ఇకపై ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు.బి

**ఈ ప్రాంతాల వారికి మెరుగైన రైలు సౌకర్యం**

కొమురవెల్లి కొత్త రైల్వే స్టేషన్ తో చేర్యాల, మద్దూరు, నర్మెట్ట మండలాల ప్రజలకు రైలు సౌకర్యం అందుబాటులోకి వస్తుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. దీనివల్ల విద్యార్థులకు, చిరు వ్యాపారులకు కూడా ప్రయోజనం కలుగుతుందన్నారు. కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి వచ్చే వారికి రైలు ప్రయాణంతో సగానికి సగం ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు.

**సికింద్రాబాద్ సిద్దిపేట మార్గంలో నడిచే నాలుగు డెమూ రైళ్లకు హాల్ట్**

కొత్తగా ప్రారంభమైన కొమురవెల్లి స్టేషన్లో హై లెవెల్ ప్యాసింజర్ ప్లాట్ఫారం 400 మీటర్లు, విశ్రాంతి హాల్, టికెట్ కౌంటర్, తాగునీరు, విద్యుదీకరణ, స్థానిక సంస్కృతిని తెలిపే పెయింటింగ్స్, అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేశారు. ఇక సికింద్రాబాద్ సిద్దిపేట మార్గంలో నడిచే నాలుగు డెమూ రైళ్లకు కూడా ఈ స్టేషన్లో హాల్ట్ కల్పించారు. సిద్దిపేట నుండి వచ్చే రైలు మధ్యాహ్నం 2 గంటల 38 నిమిషాలకు, ఉదయం 6 గంటల 45 నిమిషాలకు, సికింద్రాబాద్ నుండి వెళ్లే రైళ్లు మధ్యాహ్నం 12 గంటల 44 నిమిషాలకు, రాత్రి 8 గంటల 04 నిమిషాలకు అక్కడ ఆగుతాయి.



# తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బోనాల ఉత్సవాలు ప్రతీక: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## రాళ్లగూడలో వైభవంగా శ్రీఅక్కమహాంకాళి-శ్రీ బీరప్ప బోనాల మహోత్సవం..

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

**శంషాబాద్,జులై26(ప్రభాత ఉదయం)**

శంషాబాద్ మండలంలోని రాళ్లగూడలో శ్రీఅక్క మహాంకాళి–శ్రీబీరప్ప బోనాల మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తజనంతో కిక్కిరిసిపోయాయి.డప్పు వాయిద్యాలు,పోతరాజుల విన్యాసాలు,సాంప్రదాయ నృత్యాలతో బోనాల ఊరేగింపు కన్నులపండువగా సాగింది.ఈ మహోత్సవంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పాల్గొని శ్రీఅక్కమహాంకాళి అమ్మవారు,శ్రీబీరప్ప స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.అమ్మవారి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.రాళ్లగూడ కురుమ సంఘం పెద్దలు,సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.సాంప్రదాయ బోనాలు సమర్పిస్తూ మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించగా,యువత ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు.ఆలయంలో ప్రత్యేక అలంకరణలు,పూజా కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ...బోనాల పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే గొప్ప సాంస్కృతిక వేడుక అని అన్నారు.ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు సమాజంలో ఐక్యతను,సామరస్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ సంప్రదాయాలను పరిరక్షిస్తూ భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు.ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.భక్తుల రద్దీ దృష్ట్యా ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించగా,ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి.ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు,ప్రజాప్రతినిధులు,స్థానిక నాయకులు,మహిళలు,యువతతో పాటు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో అలసత్వం..

## మలక్‌పేట్ ఇన్‌స్పెక్టర్ సస్పెండ్..!

**హైదరాబాద్ , జూలై 26(ప్రభాత ఉదయం)**



విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం ప్రదర్శించిన మలక్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నరసింహపై సస్పెన్షన్ వేటు పడింది. ఆయన్ను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు శాఖలో బాధ్యతారాహిత్యానికి ఏమాత్రం తావులేదని మరోసారి స్పష్టం చేస్తూ నగర పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం ప్రదర్శించిన మలక్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నరసింహను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.అధికారిక విధుల్లో లోపాలు, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించకపోవడం వంటి అంశాలను తీవ్రంగా పరిగణించిన పోలీస్ ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణ అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఈ నిర్ణయంతో మరోసారి స్పష్టమైంది.

**బాధ్యతారాహిత్యాన్ని ఉపేక్షించేది లేదు: సీపీ సజ్జనార్**

ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ పోలీసు అధికారులకు స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు అధికారి పూర్తి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వం లేదా బాధ్యతారాహిత్యం ప్రదర్శించిన వారిపై ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకం పెంచేందుకు క్రమశిక్షణ అత్యంత కీలకమని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి ఘటనలు పునరావృతమైతే మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సాగునీటి విడుదలపై సందిగ్ధత!

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 26(ప్రభాత ఉదయం)**


ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కలిసొస్తుందని ఆశపడ్డ జూరాల ఆయకట్టు రైతులకు తీవ్ర నిరాశే ఎదురవుతోంది. ఎల్ నినో ప్రభావంతో ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో ఆరుతడి పంటలు వేసుకోవడానికి కూడా వీలు లేకుండా పోయింది. కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో వర్షభావ పరిస్థితుల వల్ల జూరాల ప్రాజెక్టుకు వరద నీటి రాక దాదాపు నిలిచిపోయింది.ఇటీవల కర్ణాటకలోని ఎగువ జలాశయాల నుంచి జూరాలకు కొంతవరకూ వరద నీరు రావడంతో ఆయకట్టు పరిధిలోని రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటే నీరు విడుదల



చేస్తారని భావించి, దుక్కులు దున్ని నారుమడులు పోసుకుని సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. జూరాల కుడి, ఎడమ కాలువల ద్వారా పూర్తి స్థాయిలో నీటిని వదులుతార? వారబందీ పద్ధతి ద్వారా వదులుతార అనేది ప్రశ్నగా మారింది.జూరాలకు వరద ప్రవాహం తగితే ఉన్న నీటిని త్రాగునీటి అవసరాల కోసం వినియోగించుకోవల్సి వస్తుంది. కనీసం వారబందీ పద్ధతి ద్వారా కాలువలకు సాగునీటిని విడుదల చేసి, మొదటి పంటను కాపాడాలని ఆయకట్టు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల స్పష్టత.. ప్రభుత్వ ఆలోచన**

భవిష్యత్తులో జూరాల ప్రాజెక్టుకు వచ్చే వరద నీటి



ప్రవాహాన్ని బట్టే సాగునీటి విడుదల ఆధారపడి ఉంటుందని ప్రాజెక్టు అధికారులు స్పష్టం చేశారు.

ప్రస్తుతం వరద రాక స్వల్పంగా ఉండటం, రాబోయే రోజుల్లో కూడా పెద్దగా వచ్చే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఉన్న నీటిని ప్రాజెక్టులోనే నిల్వ చేసి, కనీసం ఒక పంట కైనా నీరందించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు సాగునీటి విడుదల ప్రశ్నార్థకంగా మారింది.

# జోరుగా వరినాట్లు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 26(ప్రభాత ఉదయం)**



ధరూర్, కేటిదొడ్డి మండలంలో వరి నాట్లు జోరందకున్నాయి. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్న రైతాంగం కర్ణాటక జలాశయాల నుంచి జూరాల ప్రాజెక్టు కు వరద ప్రవాహం మొదలవడంతో ఎక్కడ చూసినా రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. అందుకు తగ్గట్టుగానే వరి నారుమళ్లు పోసుకుని పొలాలను దున్ని నాట్లు వేస్తున్నారు. ధరూర్, కేటిదొడ్డి మండలంలోని పలు గ్రామాల్లో వరి రైతులు తమ వ్యవసాయ పొలాల దగ్గర వరినాట్లు వేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు కు వరద వస్తున్న నేపథ్యంలో జూరాల ప్రాజెక్టు మీద ఆదాపడి ఉన్న నెట్టెంపాడు, ర్యాలంపాడు రిజర్వాయర్ ద్వారా సాగు నీరందిస్తారన్నా ఆశతో చాల గ్రామాలలో వరి నాట్లు ఊపందుకున్నాయి. అలాగే రైతులు బావులు, బోర్ల దగ్గర వరి నాట్లను వేస్తున్నారు. కొన్ని గ్రామాలలో పత్తి, వేరుశనగ, పంటను తీసివేసి వరిని సాగు చేస్తున్నారు.

# ప్రగతి నగర్‌లో ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలి

## ఈఈ రాజేశ్వరి కి వినతి పత్రాన్ని అందించిన స్టేట్ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి జిట్టా రమ్యకృష్ణ సునీల్ యాదవ్

**కూకట్‌పల్లి, జూలై 26 (ప్రభాత ఉదయం)**



కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కైతాపూర్ డివిజన్ పరిధిలో ఉన్న ప్రగతి నగర్ కాలనీలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేయాలని స్టేట్ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి జిట్టా రమ్యకృష్ణ సునీల్ యాదవ్ సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన సీఎంసీ కూకట్‌పల్లి సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) రాజేశ్వరిని కలిసి ప్రగతి నగర్ కాలనీలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు అధిక వేగంతో ప్రయాణిస్తున్నాయని, దీనివల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు రహదారులు దాటే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని అత్యవసరంగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని వినతిపత్రాన్ని సమర్పించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేశ్వరి సమస్యపై సానుకూలంగా స్పందించారు. సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి, అవసరమైన సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేసి త్వరలోనే ప్రగతి నగర్ కాలనీలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిట్టా రమ్యకృష్ణ సునీల్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజల భద్రతకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లడం తమ బాధ్యత అని అన్నారు. ప్రగతి నగర్‌లో రహదారులపై అధిక వేగంతో వాహనాలు సంచరించడం వల్ల ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక కాలనీ వాసులు కూడా ఈ సమస్యను పరిష్కరించేందుకు ముందుకొచ్చిన జిట్టా రమ్యకృష్ణ సునీల్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, అధికారులు ఇచ్చిన హామీని త్వరగా అమలు చేసి ప్రగతి నగర్‌లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ అధికారులు స్పందించడం హర్షణీయమని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# సంక్షేమ పథకాలతో భవన నిర్మాణ కార్మికులకు భరోసా

## జనసేన నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్


**కూకట్ పల్లి, జూలై 26 (ప్రభాత ఉదయం)**




కూకట్ పల్లి నియోజకవర్గం లోని మూసాపేట్ హనుమాన్ చౌక్ వద్ద జనసేన పార్టీ నాయకులు సుదర్శన్, రాము ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పథకంలో భాగంగా భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు వారిచే నిర్వహించిన (లేబర్ కార్డ్, ఇష్రమ్ భీమా కార్డ్ ) నమోదు కార్యక్రమాన్నికి జనసేన పార్టీ జాయినింగ్ కమిటీ సభ్యులు, కూకట్ పల్లి నియోజకవర్గం కంటెస్ట్ ఎం.ఎల్.ఏ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఉంటారని, ఈ కేంద్ర ప్రభుత్వ భీమా పథకం వలన మీ కుటుంబానికి రక్షణ లభిస్తుందని అన్నారు. గత రెండు వారాలు గా ఏ.వి.బి పురం లో ఈ భీమా పథక కార్యక్రమం జరుగుతుందని, నియోజక వర్గంలో అన్ని డివిజన్ లో నిర్వహిస్తామనారు, ఈ అవకాశాన్ని ప్రతి కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఎన్.నాగేందర్, కొల్లా శంకర్,వేముల మహేష్, బోగాది వెంకటేశ్వర రావు, పండుగ సూర్య, బడే విశ్వేశ్వర్ రావు, చిట్టిబాబు, మూసాపేట్ జనసేన నాయకులు పి. దుర్గారావు,ఎస్. కుమార్, బాలకృష్ణ, పూర్ణచందర్ రెడ్డి, భీమ్ రావు, తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

# అత్తాపూర్‌లో ప్రధాని మన్‌కీబాత్ కార్యక్రమం వీక్షించిన బీజేపీ శ్రేణులు..

**రాజేంద్రనగర్,జులై26(ప్రభాత ఉదయం)**



ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు అంజన్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు.అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడా బూత్ నంబర్–218లో డివిజన్ కార్యదర్శి శివరాజ్‌గౌడ్ నివాసంలో ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు కలిసి వీక్షించారు.అత్తాపూర్ డివిజన్ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకుడు అంజన్‌కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశాభివృద్ధి,జాతీయ సమైక్యత,ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రధానమంత్రి చేసిన ప్రసంగం ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు.ఆగస్టు 8వ తేదీ నుంచి నిర్వహించనున్న తిరంగా యాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని,దేశభక్తిని చాటిచెప్పే ఈ కార్యక్రమంలో యువత,మహిళలు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి,రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కొమురయ్య,జిల్లా కార్యదర్శి మల్లేష్‌యాదవ్, రాజశేఖర్, జయానంద్‌రెడ్డి,నల్లింగ్ రమేష్, శివరాజ్‌గౌడ్, కమలేకర్ రాజు,నాగేష్ యాదవ్, మేడంరాము,రవీందర్‌రెడ్డి తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.